క్లుప్తంగా

ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో మల్లికార్జున్

తంగళ్లపల్లి: గ్రామాల వారీగా ఇళ్ల వివరాలు ఆన్‌లైన్ చేయాలని డీఎల్‌పీవో మల్లికార్జున్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఇళ్లు, ప్రభుత్వ భూములు, పట్టా భూములు, గ్రామకంఠాల వారీగా ఇళ్ల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, రవి, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రి కోసం సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మించాలని బీజేపీ నాయకులు మండలంలోని వల్లంపట్ల గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ 30 పడకల ఆస్పత్రి మంజూరు చేస్తానని హామీ ఇచ్చి 57 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మంజూరు చేయలేదన్నారు. ఆస్పత్రి మంజూరు చేసేంత వరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, స్వామి, సంతోష్, రమేశ్, రాజు, హరీశ్, సాయిప్రసాద్ రెడ్డి, గంగాధర్, రంజిత్, లక్ష్మణ్, రాజు, అరుణ్, అశ్విని, ముత్తక్క పాల్గొన్నారు.

కార్మికుల స్థలాన్ని కాపాడండి

ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వినతి



ఎస్పీ అఖిల్‌ను సన్మానిస్తున్న భాస్కర్

సిరిసిల్లటౌన్: శ్రామికుల కష్టార్జితంతో భవన నిర్మాణ కార్మికుల భవనం కోసం పెద్దలు కొన్న స్థలాన్ని అక్రమార్కుల నుంచి రక్షించాలని ఎస్పీ అఖిల్ మహాజన్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ కోరారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్పీని గురువారం కార్మిక నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లా కేంద్రం నటరాజ్ థియేటర్ సమీపంలో 1980 దశాబ్దంలో తమ సంఘం పెద్దలు గుంట స్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. సదరు స్థలాన్ని కొందరు అమ్ముకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కార్మికులకు న్యాయం చేయాలని విన్నవించగా ఎస్పీ సానుకూలంగా స్పందించారు. నాయకులు ఎస్.కే. మహబూబ్, పోకల దేవయ్య, బాలవ్వ, రాజు, బాలు, కైలాశం పాల్గొన్నారు.

జాతరకు రెడీ

మహాశివరాత్రి వేడుకలకు శివక్షేత్రమైన వేములవాడ సిద్ధమైంది. భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారన్న అంచనా మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లు, చంటి బిడ్డలకు పాలిచ్చే కేంద్రాలు, పుణ్యస్నానాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, సిరిసిల్ల




వేములవాడ జాతర గ్రౌండ్‌లో బోర్డులు



గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న షామియానాలు



ఏర్పాటు చేసిన రాజన్న జల ప్రసాదం



విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ద్వారం



రాజన్న ప్రధాన ద్వారం వద్ద జాతర సందడి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- మహా జాతరలో పారిశుధ్య పనులు ప్రారంభం
- పనుల్లో 512 మంది కార్మికులు



రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి అత్యంత వైభవంగా జరిగే మహాశివరాత్రి వేడుకల్లో ఎక్కడా పారిశుధ్యం లోపించకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి మున్సిపల్ కార్మికులు వేములవాడకు చేరుకుని పారిశుధ్య పనులు ప్రారంభించారు. పట్టణంలోని రోడ్లు శుభ్రం చేయడం మొదలుపెట్టారు. వీరు రాత్రి బస చేసేందుకు పట్టణంలోని సినారె కళామందిరం, భోజన వసతి రాజన్న ధర్మశాలలో ఆలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

నాలుగు రోజులు పారిశుధ్య పనులు..

మహాశివరాత్రి వేడుకల సందర్భంగా మున్సిపల్ కార్మికులు వేములవాడలోని రోడ్లన్నీ శుభ్రం చేస్తున్నారు. గురువారం నుంచి ఆదివారం వరకు నిరంతరం 24 గంటలు మూడు షిఫ్టుల వారీగా పనులు చేయనున్నారు. ఆలయ పరిసరాలు, జాతరగ్రౌండ్, ఆలయం చుట్టూ జనాలు ఎక్కువగా ఉండే పరిసరాల్లో 30 పెద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు.

512 మంది పారిశుధ్య కార్మికులు

మహాజాతరకు వేములవాడ మున్సిపల్ నుంచి 101 మంది పారిశుధ్య కార్మికులు, అలాగే ఇతర సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్ నుంచి 225 మంది పారిశుధ్య కార్మికులు వచ్చారు. 186 మంది ప్రైవేటు పారిశుధ్య కార్మికులను తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 512 మంది కార్మికులకు 20 జోన్లుగా విభజించారు. వీరికి ఇన్‌చార్జిగా 43 మంది పంచాయతీ కార్యదర్శులను, 28 మంది సూపర్‌విజన్‌గా నియమించారు.

డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు

పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను వేములవాడ మున్సిపల్ డంపింగ్ యార్డుకు తరలించనున్నారు. చెత్త తరలింపునకు 25 మున్సిపల్ చెత్త ఆటోలు, 5 మున్సిపల్ ట్రాక్టర్లు, 5 ప్రైవేటు ట్రాక్టర్లు, 9 ఇతర ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రతి సంవత్సరం వస్తాం



మహాశివరాత్రి వేడుకకు ఏటా పారిశుధ్యం పనులు చేసేందుకు వేములవాడకు వస్తాం. అలాగే భోజన వసతి, రాత్రి బస అన్ని ఏర్పాట్లు చేస్తారు. బుధవారం వచ్చి వెంటనే పనులు ప్రారంభించాం.

– శంకరవ్వ, పారిశుధ్యకార్మికురాలు, ముత్యంపేట

నాలుగు రోజులు చేస్తాం



మహాశివరాత్రికి నాలుగు రోజులు షిఫ్టుల వారీగా పనులు చేస్తాం. గతంలో చేశాం కాబట్టి మాకు కొత్త కాదు. ఎక్కడ పని ఎక్కువగా ఉంటే అక్కడికి వెళ్లి పనులు చేస్తాం.

– కనుకమ్మ, పారిశుధ్య కార్మికురాలు,ముత్యంపేట

పారిశుధ్యం లోపించకుండా..



ఎక్కడ పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇప్పటికే ఇతర మున్సిపల్‌ల నుంచి వచ్చిన కార్మికులతో పనులు ప్రారంభించాం. నాలుగు రోజులు నిరంతరం జరుగుతాయి. భక్తులు కూడా డస్ట్ బిన్‌లలో చెత్త వేయాలి.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్,వేములవాడ

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట: గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండలం భీమునిమల్లారెడ్డిపేటలో రూ.20 లక్షల సెస్ నిధులతో ఇంప్రూవ్‌మెంట్ ఫీడర్ ఏర్పాటు పనులను సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలతో కలిసి గురువారం ప్రారంభించి మాట్లాడారు. లింగన్నపేట సబ్ స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డిపేట, రామానుజాపూర్ గ్రామాల్లో వ్యవసాయానికి లోవోల్టేజీ కొరత లేకుండా చూస్తామన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ఫీడర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సర్పంచ్ శెట్టి మహేశ్వరి, ఎంపీటీసీ రాజేందర్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.



ఫీడర్ పనులు ప్రారంభిస్తున్న టెస్కాబ్ చైర్మన్

సింగారంలో జీపీ భవనానికి శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన పంచాయతీ భవనానికి టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ నర్సాగౌడ్, ఉపసర్పంచ్ ఉస్మాన్, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



దారిలో గుంత.. ప్రజలకు చింత

రుద్రంగి: మండల కేంద్రంలోని రామకిష్టాపూర్ కాలనీ హరిజనవాడకు, అలాగే దర్గమ్మకు వెళ్లే ప్రధాన దారిలో కల్వర్టు వద్ద దారిలో భూమి లోపల వేసిన పైపు ధ్వంసమై రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. నెల రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరగక ముందే గుంతను పూడ్చి వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రాందాస్, కార్యదర్శి, రుద్రంగి
ఫోన్ నెంబర్: 96665 55442

రేవంత్‌రెడ్డి పాదయాత్రలో ఆది శ్రీనివాస్



వేములవాడ: డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న పాదయాత్రలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం, జిల్లా పార్టీ పరిస్థితులపై, వచ్చే ఎన్నికల్లో చేపట్టే విధానాలపై చర్చించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ విధానాలను తీసుకెళ్లాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

పండిట్ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని నిరసన



నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల ప్రభుత్వ పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పోస్టులతో పాటు పండిట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఉపాధ్యాయులు పరకాల రవీందర్, షాబుద్దీన్, నసీరుద్దీన్, రమేశ్, మధుసూదన్, వనజ, సుజాత, రేణుక, నీలం అంజయ్య, సంగీత, రజనీ, విజయలక్ష్మీ, షాతిమా, హెచ్‌ఎం బి.ఉషారాణి, నరసింహా రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

తంగళ్లపల్లి: మండలంలోని బాలమల్లుపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని ఎడ్లవానికుంటలో గురువారం ముగ్గురు లబ్ధిదారులకు సంబంధించిన డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన దొరగొల్ల లాస్య రాజు, కవాటి మమత పర్శరాములు, రాజరపు సాయ్య శ్రీనివాస్ ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కస్తూరి లత, ఎంపీటీసీ బైరినేని రాము, నాయకులు తిరుపతిరెడ్డి, మనీషా, ఎల్లయ్య, వసాల వీరారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న సెస్ చైర్మన్

గంభీరావుపేట: మండలం భీముని మల్లారెడ్డిపేటలో ఏడుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం చెక్కులను సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు గురువారం పంపిణీ చేశారు. ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ విజయ, సర్పంచ్ మహేశ్వరి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఎంపీటీసీ రాజేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు దయాకర్‌రావు, బాలవ్వ, సింగిల్ విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్ పాల్గొన్నారు.

పరిహారం అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామానికి చెందిన పెద్ది పుష్ప మల్లయ్యకు చెందిన బర్రె ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై మృతిచెందగా బాధితులకు సెస్ నుంచి రూ.40 వేల పరిహారాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, ఉపసర్పంచ్ నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: 2018 ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు రూ.90 వేల వరకే రుణమాఫీ చేస్తామని మాట్లాడటం ఏంటని యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రుణమాఫీ చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వికాస్–దీప దంపతులు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్‌ను ఫౌండేషన్ బాధ్యులు డాక్టర్ చెన్నమనేని వికాస్–దీప గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్పంచ్ తుమ్మల యమున, ఉపసర్పంచ్ ఓరుగంటి శంకర్, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, మాజీ ఎంపీపీ సంకినేని లక్ష్మి, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మండలాధ్యక్షుడు రామచంద్రం, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, మండలాధ్యక్షుడు సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

రిలే దీక్షలు విరమణ



మాట్లాడుతున్న సమ్మయ్య, విజయ్‌కుమార్

సిరిసిల్లటౌన్: అర్హులైన పేదలకు సొంతిల్లు అందించడంలో న్యాయం చేస్తామని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఐదు రోజులుగా ఆర్డీవో ఆఫీసు ఎదుట డబుల్ బెడ్రూం ఇళ్లు రాని అర్హులు అందరికీ నివేశనా స్థలంతో పాటు రూ.5 లక్షలు చెల్లించాలని సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షల శిబిరాన్ని వారు సందర్శించి మాట్లాడారు. పేదల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం జరుపుతామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోవాలి

వీర్నపల్లి: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ కోకన్వీనర్ ఆడెపు రవీందర్ అన్నారు. మండలంలో మద్దిమల్లలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుండాటి వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బట్టు పీరియా, మద్దిమల్ల బూత్ కమిటీ అధ్యక్షుడు బండారి మహేశ్, బంజరు గ్రామ బూత్ అధ్యక్షుడు బట్టు గోవర్ధన్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి పోతారు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని వర్ధవెల్లి గ్రామంలో ప్రజాగోస.. బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ పెరక శ్రావణ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు గుడి రవీందర్‌రెడ్డి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

కంటివెలుగు అద్దాల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: కంటివెలుగులో భాగంగా స్థానిక పీహెచ్‌ఎస్ పరిధిలో పరీక్షలు నిర్వహించి 182 మందికి కళ్లద్దాలను గురువారం వైద్యాధికారి ప్రవంతి అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభం

గంభీరావుపేట: మండలంలోని భీమునిమల్లారెడ్డి పేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి కళ్లద్దాలు కూడా ఉచితంగానే అందిస్తారని తెలిపారు.

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ నేతికుంట జలపతి, ఉపసర్పంచ్ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేటలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అ లాగే రాచర్లగొల్లపల్లి ఎల్లమ్మ సిద్దోగ వేడుకల్లో భా గంగా ఆహ్వానించేందుకు గడతో వచ్చిన గౌడ సంఘం నాయకులను కలిసి నృత్యం చేశారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పి.రేణుక, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర రజకసంఘం కోఆర్డినేటర్ బాలమల్లు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



చందుర్తి: మండలంలోని దేవునితండాలో సేవాలాల్ జయంతిని గిరిజనులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగ్ బండార్, సేవాలాల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ రిటైర్డ్ ఈఈ గోవిందరావు, జెడ్పీటీసీ నాగం కుమార్, రుద్రంగి ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సర్పంచ్ కరుణాకర్, టీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు ఎల్లయ్య, ఆలయ చైర్మన్ సంతోష్, ఆలయ వైస్‌చైర్మన్ గణేశ్ పాల్గొన్నారు.

గోరుముద్ద ప్రారంభం

ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి గురువారం ప్రారంభించారు.

గంభీరావుపేట: ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని గురువారం గంభీరావుపేట మండలం లింగన్నపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రారంభించారు.

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అల్పాహారం అందించారు.

పుస్తెమెట్టెలు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేట తండాకు చెందిన శివరాత్రి విజయ–లింగంల కూతురు శృతి వివాహానికి, కిష్టునాయక్‌తండాలోని ధర్జీభాయి–సక్కునాయక్‌ల కూతురు సంగీత వివాహానికి సామాజిక కార్యకర్త నేవూరి వెంకట్‌రెడ్డి గురువారం పుస్తెమెట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభునాయక్, ముక్క శంకర్, ఎంపీటీసీ ధరావత్ రజిత, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

వీర్నపల్లి: గత డిసెంబర్ 27న చెరువులో పడి మృతిచెందిన మండల సీతారాం నాయక్ తండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బానోతు గణేశ్‌కు రూ.రెండు లక్షల బీమా చెక్కును పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి పాల్గొన్నారు.